సాక్షి
నిజామాబాద్
బుధవారం, 10, మే, 2023



సీసీ కెమెరాలతో భద్రత

సీసీ కెమెరాల ఏర్పాటుతో సామాజిక భద్రత పెరుగుతుందని ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.
- 8లో ▸



ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.4 /28.7

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండవచ్చు. సాయంత్రం మేఘావృతం అవుతుంది. రాత్రి ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

నిజామాబాద్ అర్బన్ : ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చాయి. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఇంటర్ సెకండియర్ విద్యార్థిని ఆరెపల్లి దీక్షితకు ఎంపీసీ విభాగంలో 992/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మూడవ ర్యాంకు సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి.స్పందన 465/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు సాధించింది. వీరిద్దరు నగరంలోని వెక్టర్ కళాశాలకు చెందిన విద్యార్థులు, బైపీసీ సెకండియర్ ఫలితాలలో సిహెచ్ నిషిత రెడ్డి 989/1000 మార్కులతో రాష్ట్ర ర్యాంకు సాధించింది.

కేజీబీవీలో ఉత్తమ ఫలితాలు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని కేజీబీవీ కళాశాలలు ఇంటర్ ఉత్తీర్ణతలో మెరుగైన ఫలితాలు సాధించాయి. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో డిచ్‌పల్లి కేజీబీవీకి చెందిన డి.రోజా 452/470 మార్కులు సాధించింది. బైపీసీ విభాగంలో రాజశ్రీ 408/440 మార్కులు సాధించింది. నిజామాబాద్ కేజీబీవీలో సీఈసీ విభాగంలో త్రివేణి 464/470 మార్కులు సాధించింది. బాల్కొండ కేజీబీవీలో వైష్ణవి ఒకేషనల్ విభాగంలో 477/500 మార్కులు సాధించింది. ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో మాక్లూర్ కేజీబీవీ వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. బైపీసీ విభాగంలో ఇదే కళాశాలకు చెందిన పి.నవీన 975/1000 మార్కులు సాధించింది. ఇదే కళాశాల ఎంపీసీ విభాగంలో నందిత 972/1000 మార్కులు సాధించింది. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీలో కె.రచన 436/470 మార్కులు సాధించింది. బైపీసీ విభాగంలో స్వాతి 389/440 మార్కులు సాధించారు. జిల్లావ్యాప్తంగా మాక్లూర్ కేజీబీవీ అత్యధికంగా 91.80 శాతం ఉత్తీర్ణత సాధించారు. అతి తక్కువగా బోధన్ కేజీబీవీ 37.80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆర్మూర్ కేజీబీవీలో 45.83, బాల్కొండ కేజీబీవీలో 64.79, భీమ్‌గల్ కేజీబీవీలో 77.14శాతం, డిచ్‌పల్లి కేజీబీవీలో 77.59, జక్రాన్‌పల్లిలో 61.02, నందిపేటలో 64 ఉత్తీర్ణత సాధించారు.

వెయిటేజీ ఎత్తివేత

నిజామాబాద్ అర్బన్ : ఇంటర్‌లో వెయిటేజీ మార్కులు ఎత్తివేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారని డీఐఈవో రఘురాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంటర్ మార్కులు కేవలం ఐఐటీ, మెడికల్ ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు అర్హతగానే భావించాల్సి ఉంటుందన్నారు. కాబట్టి భవిష్యత్తులో తల్లిదండ్రులు విద్యార్థులు విద్యాసంస్థలు అందరికీ కూడా ఐఐటీ మెడికల్ ఎంసెట్లో ప్రవేశ పరీక్షలపై దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారన్నారు.

బాలికలదే పైచేయి



- ఫస్టియర్‌లో 51 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్‌లో 60 శాతం..
- సెకండియర్‌లో 15వ స్థానంలో నిలిచిన జిల్లా

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో గతేడాదిలాగే బాలికల హవా కొనసాగింది. బాలికలు సెకండియర్‌లో 68 శాతంతో ముందంజలో ఉన్నారు. బాలురు 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో బాలురు 42 శాతం సాధించగా బాలికలు 58 శాతం పాసై తమ సత్తా చాటారు.

నిజామాబాద్ అర్బన్ :
ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు గత ఏడాది కంటే ఈసారి తగ్గాయి. మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు తగ్గాయి. మార్చి 14 నుంచి ఏప్రిల్ 28 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. మంగళవారం ఫలితాలు వచ్చాయి. 2022–23 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో ఇంటర్ సెకండియర్‌లో 60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఫస్టియర్‌లో 58 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది రెండవ సంవత్సరంలో మొత్తం 14,086 మంది విద్యార్థులకు గాను 8,561 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 6,391 మందికి గాను 3,284 మంది విద్యార్థులు పాస్ కాగా 51 శాతం మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 7,695 మంది పరీక్షలకు హాజరు కాగా 5,277 మంది విద్యార్థినులు పాసయ్యారు.

సెకండియర్ ఫలితాల్లో..
సెకండియర్ ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. అలాగే ఫస్టియర్ విద్యార్థులు 15,215 మంది పరీక్షలకు హాజరు కాగా 7,782 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 51 శాతం సాధించి రాష్ట్రంలో 16వ స్థానంలో పొందారు. వీరిలో బాలురు 7,000 మంది పరీక్షలకు హాజరు కాగా 2,966 మంది బాలురు పాసై 42 శాతం సాధించా రు. కాగా బాలికలు 8,215 మంది పరీక్షలకు హాజ రు కాగా 4,816 మంది పాసై 58 శాతం సాధించారు.

విద్యార్థులపై కోపాలొద్దు..
ఉత్తీర్ణత తగ్గిన దృష్ట్యా విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే వారి తల్లిదండ్రులు కోపగించుకోరాదని టెలీమానస్‌ను సంప్రదిస్తే వారికి కౌన్సెలింగ్ ఇస్తారని ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సప్లమెంటరీ కోసం..
సప్లమెంటరీ కోసం ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు ఫీజులను ఆయా కళాశాలలో చెల్లించాలని డీఐఈవో పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 4వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతం పరీక్షలలో రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరుతున్న విద్యార్థులు రీకౌంటింగ్‌కు రూ. 100, రీకౌంటింగ్, ఆన్సర్‌షీట్స్ జిరాక్స్ కాపీల కోసం రూ.600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఏడాది వారిగా ఫలితాల తీరు..

ఇంటర్ ఫస్టియర్			
ఏడాది	పరీక్ష రాసిన వారు	పాసైన వారు	శాతం
2018-19	17,004	9,618	57
2019-20	19,337	9,430	49
2020-21	18,697	18,697	100
2021-22	15,360	8,974	58
2022-23	15,215	7,782	51

సెకండియర్			
ఏడాది	పరీక్ష రాసిన వారు	పాసైన వారు	శాతం
2018-19	16,116	10726	67
2019-20	17,364	10465	60
2020-21	16,265	16265	100
2021-22	15,742	10372	65
2022-23	14,086	8561	60

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



అక్షయ, నందిపేట

శ్రీరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రాజమణి, చిన్నయ్య దంపతుల కుమార్తె అక్షయ. ఆర్మూర్‌లోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివి 9.8 మార్కులు సాధించానని, అనంతరం ఇంటర్ ఎస్ఆర్ కళాశాలలో చేరి ఎంపీసీ 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించానన్నారు. ఆమె తల్లి గృహిణి కాగా వ్యవసాయం చేస్తూ తండ్రి చిన్నయ్య తన ఇద్దరు కూతుళ్లను చదివిస్తున్నారు. అక్షయ చెల్లెలు ఎనిమిదో తరగతి చదువుతోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని అక్షయ కోరుకుంటుంది.

సివిల్స్ నా లక్ష్యం..



శర్వాణి, సిర్నాపల్లి, ఇందల్వాయి

ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన శర్వాణి ఎంపీసీ విభాగంలో 991 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాదించానని సిర్నాపల్లికి చెందిన శర్వాణి పేర్కొంది. తండ్రి రమేశ్ తల్లి జ్యోతి తండ్రి తన గ్రామంలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తల్లి గృహిణి పదో తరగతి చదువుకుంది. స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన శర్వాణి 10 జీపీఏ సాధించింది. అనంతరం ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. సివిల్స్ తన లక్ష్యమని ఆమె పేర్కొంటుంది.

ఇంజినీర్‌గా సేవలందిస్తా..



ఆరెపల్లి దీక్షిత, వినాయక్‌నగర్

ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 992 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించానని ఆరెపల్లి దీక్షిత పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకు సాధించిన ఆరెపల్లి దీక్షిత తండ్రి రమేష్, తల్లి భాగ్య. ప్రస్తుతం తల్లీదండ్రులు ముంబాయిలో రజక వృత్తిలో ఉన్నారు. దీక్షిత స్థానికంగా బంధువుల వద్ద ఉండి నగరంలోని వెక్టర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించింది. 10వ తరగతిలో 9.8 జీపీఏ సాధించి తాను మంచి ఇంజినీరు కావాలని కోరుకుంటున్నానని పేర్కొంది.

విధుల్లోకి 93 మంది జేపీఎస్‌లు

- విధుల్లో చేరని మరో 328 మంది టర్మినేట్..!
- నేడు చర్చల తర్వాతే సమ్మెపై రానున్న స్పష్టత



ధర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో రిపోర్ట్ చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి

సుభాష్ నగర్ : సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులతో 93 మంది స్పందించి విధుల్లో చేరారు. నోటీసులను అందుకున్న జేపీఎస్‌లు గడువులోపు ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో మంగళవారం రిపోర్ట్ చేశారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విధుల్లో చేరని మరో 328 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు టర్మినెట్ అయినట్లేనని అధికారులు భావిస్తున్నారు. కాగా తుది ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి వెలువడాల్సి ఉంది. జేపీఎస్‌లు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 12 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగిన విషయంతెలిసిందే.

నేడు మరో దఫా చర్చలు..
జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె, ప్రభుత్వం అల్టీమేటం జారీ చేసిన నేపథ్యంలో పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో బుధవారం ఉదయం మరో దఫా చర్చలు జరగనున్నట్లు తెలిసింది. అధికారులు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, యూనియన్ల ప్రతినిధులు జేపీఎస్‌లను బుజ్జగించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. జేపీఎస్‌ల డిమాండ్లకు స్వల్ప వ్యవధిలో పరిష్కారం లభిస్తుందని మంత్రి, కలెక్టర్, పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు హామీనిచ్చారు. సోమవారం రాత్రి కూడా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో జేపీఎస్‌లు చర్చలు జరిపారు. విధుల్లో చేరాలని కలెక్టర్ సూచనలు చేశారు.అయితే 328 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరలేదు. ప్రస్తుతానికి సమ్మె కొనసాగుతోంది. నేటి చర్చల తర్వాతే సమ్మెపై స్పష్టత వచ్చే అవకాశముందని జేపీఎస్ యూనియన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

సమ్మె కొనసాగుతోంది..



జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. బుధవారం జరిగే చర్చల్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాతే సమ్మె విరమణపై రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. విధుల్లో చేరిన వారితో తమకేం సంబంధంలేదు. ఎవరి ఇష్టం వారిది. ఎవరిపై ఒత్తిడి చేయడం, బెదిరించడం లేదు.
– అనిల్, జేపీఎస్ అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు..



జిల్లావ్యాప్తంగా 93 మంది విధుల్లో చేరినట్లు నివేదికలు వచ్చాయి. మిగతా వారిపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు ఉంటాయి. సోమవారం సాయంత్రం వచ్చిన ఉత్తర్వుల ప్రకారం విధుల్లో చేరని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు టర్మినెట్ అయినట్టుగానే భావిస్తున్నాం.
– డాక్టర్ జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

గాలివాన.. పిడుగుల మోత

పిడుగు పాటుతో 48 గొర్రెలు మృతి

డొంకేశ్వర్/భీంగల్ : జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం, సాయంత్రం పలు మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. భయంకరమైన పిడుగులు పడ్డాయి. కల్లాల్లో ధా న్యం కుప్పలపై ఉంచిన టర్పాలిన్లు గాలికి లేచిపోయాయి. ధాన్యం తడిసింది. చేన్లలో ఇంకా 10 శా తం వరి కోయాల్సి ఉంది. డిచ్‌పల్లి, బోధన్, భీమ్‌గల్, ఎడపల్లి, మోస్రా, జక్రాన్‌పల్లి, సిరికొండ, ఇందల్వాయి, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లో వర్షం కురిసింది. భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామంలో పిడుగుపాటుకు కుర్మ అనిల్‌కు చెందిన 48 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అనిల్‌కు స్వల్ప గాయాలవడంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరాడు. డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో నిర్మాణంలో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయం శిఖరంపై పిడుగు పడడంతో సల్పంగా ధ్వంసమైంది. ఇందల్వాయి మండ లం నల్లవెల్లిలో నివాసాల మధ్య ఉన్న కొబ్బరి చె ట్టుపై పిడుగు పడింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.



నల్లవెల్లిలో చెట్టుపై పడిన పిడుగు

తెయూలో సద్దుమణిగిన వివాదం

ఎట్టకేలకు దిగొచ్చిన వీసీ
- పాలకమండలి సభ్యుల ఒత్తిడితో క్యాంపస్‌కు రాక
- వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానన్న వీసీ
- టీచింగ్, నాన్ టీచింగ్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు జమ



వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను నిలదీస్తున్న ఈసీ మెంబర్లు, విద్యార్థి సంఘాల నాయకులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

తెయూ (డిచ్‌పల్లి) : గత ఇరవై రోజులుగా తెలంగాణ వర్సిటీలో నెలకొన్న వివాదాలు, గందరగోళ పరిస్థితులు తాత్కాలికంగా సద్దుమణిగాయి. ఎట్టకేలకు దిగివచ్చిన తెయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి రవీందర్‌గుప్తా, పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్‌తో కలిసి వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానని అంగీకరించారు. తెయూకు రిజిస్ట్రార్ నియామకం, వీసీ అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా రచ్చకెక్కడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పాలకమండలి సభ్యులు ఏకంగా వీసీ పై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు సిఫార్సు చేశారు. వీసీ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నిర్మలాదేవి ఈ పరిణామాలు గమనించి తిరిగి ఓయూలో రీజాయిన్ అయ్యారు. ఇలా అన్ని రకాల ఒత్తిడిలతో వీసీ ఇప్పుడు ఈసీ చెప్పినట్లు నడుచుకుంటానని తగ్గాల్సి వచ్చింది.

జీతాల కోసం ఆందోళన..
వీసీ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నిర్మలాదేవి టీచింగ్, నాన్–టీచింగ్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల చెక్కులపై సంతకాలు చేసి బ్యాంకుకు పంపించగా బ్యాంకు అధికారులు తిరస్కరించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు కోసం విధులు బహిష్కరించి ధర్నాలు చేస్తున్నారు. సోమవారం రిజిస్ట్రార్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ యాదగిరి, పాలక మండలి సభ్యులను కలిసి తమకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులతో మాట్లాడానని జీతాలు పడేలా చూస్తామని రిజిస్ట్రార్, ఈసీ సభ్యులు హామీ ఇచ్చారు. అయితే యాదగిరి పంపిన చెక్కులను అంగీకరించవద్దని వీసీ రవీందర్ బ్యాంకు అధికారులకు మెయిల్ పంపించారు.

వీసీని వర్సిటీకి పిలిపించిన ఈసీ సభ్యులు
మంగళవారం ఉదయం జీతాలు రాలేదని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మళ్లీ విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఈసీ సభ్యులు వెంటనే రిజిస్ట్రార్‌తో మాట్లాడారు. వీసీ బ్యాంక్ అధికారులకు మెయిల్ చేయడంతోనే జీతాలు నిలిచిపోయినట్లు రిజిస్ట్రార్ ఈసీ సభ్యులకు వివరించారు. వెంటనే ఈసీ సభ్యులు వీసీకి ఫోన్ చేసి క్యాంపస్‌కు రావాలని వివిధ రకాల ఒత్తిళ్లు తీసుకొచ్చారు. వారి ఒత్తిడికి తలొగ్గిన వీసీ మధ్యాహ్నం వర్సిటీకి చేరుకున్నారు. వెంటనే ఈసీ సభ్యులు మారయ్యగౌడ్, గంగాధర్‌గౌడ్, ఎస్ఎల్‌శాస్త్రి, వసుంధరాదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డిలు వీసీ చాంబర్‌కు చేరుకున్నారు. అదే సమయంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చాంబర్‌లోకి వచ్చి తమ జీతాలు ఇప్పించాలని ఆందోళన చేపట్టారు. ఈసీ సభ్యులు రిజిస్ట్రార్ యాదగిరిని, బ్యాంకు మేనేజర్ రవిలను వీసీ ఛాంబర్‌కు పిలిపించి మాట్లాడారు. బ్యాంకు ఉన్నతాధికారుల సూచన మేరకు ఉద్యోగులు, సిబ్బంది జీతాలకు సంబంధించి రిజిస్ట్రార్ యాదగిరి జారీ చేసిన 12 చెక్కులను అనుమతించాలని వీసీ లేఖ రాసి అందజేశారు. రాత్రి వరకు ఉద్యోగులు, సిబ్బంది ఖాతాల్లో బ్యాంకు అధికారులు జీతాలు జమ చేయడంతో కథ సుఖాంతం అయింది.

షోకాజ్ నోటీసులు రద్దు.. వీసీ

ఈసీ సభ్యులుగా మేము సమావేశానికి హాజరైతే మాకు షోకాజ్ నోటీసులు ఎలా జారీ చేస్తానని ఈసీ మెంబర్ రవీందర్‌రెడ్డి వీసీని ప్రశ్నించారు. ఈసీ మీటింగ్‌లో నాపై ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెట్టాలని ఎలా తీర్మానిస్తారని వీసీ ఎదురు ప్రశ్నించారు. ముందు హైకోర్టులో వేసిన కేసును విత్‌డ్రా చేసుకోవాలని అప్పుడు వచ్చే ఈసీ సమావేశంలో ఈ విషయమై చర్చిద్దామని ఈసీ సభ్యుడు ఎస్ఎల్ శాస్త్రి పేర్కొన్నారు. దీంతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ హోదాలో నిర్మలాదేవి జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దు చేస్తున్నట్లు వీసీ తెలిపారు.

ఆడిట్‌సెల్ నుంచి కనకయ్యను బయటకు పంపిన వీసీ

ఆడిట్‌సెల్ డైరక్టర్ సీటులో ప్రొఫెసర్ కనకయ్య ఎందుకు కూర్చున్నారని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు, ఈసీ మెంబర్లు వీసీ రవీందర్ గుప్తాను ప్రశ్నించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ హోదాలో నిర్మలాదేవి ఇచ్చిన ఆర్డర్ మేరకు ఆడిట్‌సెల్ డైరక్టర్‌గా ఉన్నారని వీసీ తెలిపారు.
ఈసీ అనుమతి లేకుండా ఇచ్చిన ఆర్డర్స్ చెల్లవని ఆయనను ముందు బయటకు పంపించాలని ఈసీ సభ్యులు పేర్కొన్నారు. దీంతో ఈసీ సభ్యులు వెంట రాగా వీసీ రవీందర్ ఆడిట్ సెల్‌కు వెళ్లి కనకయ్యను బయటకు పంపించారు.

నిలదీసిన విద్యార్థులు,సిబ్బంది
పాలకమండలి సభ్యుల సమక్షంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు వీసీ రవీందర్‌ను నిలదీశారు. మీ రాజకీయాల వల్ల జీతాలు రాక ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వచ్చిందని మండిపడ్డారు. వర్సిటీకి చెందిన ఇద్దరు చీడపురుగుల మాటలను విని మీకు ఈ దుస్థితి వచ్చిందని, ఇకమీదటైనా వారిని దూరంగా పెట్టాలని రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. అలాగే తన పీహెచ్‌డీ సర్టిఫికెట్ ఫేక్ అని ఎలా చెబుతారని నిలదీశారు. అలా చెప్పడం తన తప్పేనని వీసీ అంగీకరించారు.
ఇకపై పాలకమండలి సభ్యు ల మార్గదర్శకత్వంలో రిజిస్ట్రార్‌తో కలిసి పని చేస్తానని వీసీ రవీందర్ పేర్కొన్నారు. ఈ నెల 12న జరిగే పాలకమండలి సమావేశానికి హాజరువుతానన్నారు.

రక్తమోడిన రహదారి

- సీఎంసీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు బైక్‌లను ఢీకొన్న కంటెయినర్
- తల్లీ బిడ్డలు, మరొకరు మృతి



ఘటనాస్థలిలో పోగుల శ్యాం, నవ్య



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజన్న



గోపిడి రాజన్న, పోగుల నవ్య, సమన్వి (ఫైల్)

డిచ్‌పల్లి/మోపాల్ : డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారు సీఎంసీ కళాశాల సమీపంలో 44వ జాతీయ నంబర్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. డిచ్‌పల్లి సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన పోగుల శ్యాం, భార్య నవ్య (32), ఇద్దరు పిల్లలు రుషి, సమన్వి (6) కలిసి వేల్పూర్ మండలం రామన్నపేట్‌లోని బంధువుల ఇంటికి బైక్‌పై బయల్దేరారు. వీరు డిచ్‌పల్లి మండలం సీఎంసీ వద్దకు చేరుకోగానే వెనక నుంచి అతివేగంగా వచ్చిన కంటెయినర్ బైక్‌ను ఢీకొట్టింది. అదేసమయంలో దుబ్బాక నుంచి డిచ్‌పల్లి వైపు వస్తున్న గూపన్‌పల్లికి చెందిన గోపిడి రాజన్న (55) బైక్‌ను కూడా కంటెయినర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజన్న అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ శ్యాం, నవ్య, పిల్లలు రుషి, సమన్విలను హైవే అంబులెన్స్‌లో చికిత్స కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే నవ్య, సమన్వి మృతిచెందారు. శ్యాంను కుటుంబీకులు ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోగుల శ్యాం పదిరోజుల క్రితమే గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. బంధువులను కలిసేందుకు రామన్నపేట్‌కు కుటుంబంతో కలిసి బయల్దేరాడు. రోడ్డు ప్రమాదం భార్య, కూతురును కబళించింది. శ్యాంతోపాటు కుమారుడు రుషి పరి స్థితి విషమంగానే ఉంది. కుటుంబీకులు, బంధువులు జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకున్నారు. చనిపోయిన నవ్య, చిన్నారి సమన్వి మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన గోపిడి రాజన్న ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలో బంధువులు జరుపుకున్న బీరప్ప పండుగకు హాజరయ్యాడు. తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. రాజన్నకు భార్య లక్ష్మీ, కొడుకు, కూతురు ఉన్నారు.

వైద్యవృత్తిలో రాణిస్తా..


శిరీషా, కుబీర్, నిర్మల్

నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని గోదాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్ సుశీల దంపతుల కుమార్తె సూర్యవంశి శిరీషా. బైపీసీ విభాగంలో 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించానని ఆమె పేర్కొంది. ఆమె తండ్రి వ్యవసాయం చేస్తుండగా తల్లి గృహిణి. ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో బైపీసీ వి భాగంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. తాను మంచి డాక్టర్ కావాలని ఉందని పేర్కొంది.

బ్యాంక్ అధికారినవుతా..


స్రవంతి, ఉత్తనూర్, సదాశివనగర్

ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 989 మార్కులతో రాష్ట్రస్థాయి 6వ ర్యాంకు సాధించానని స్రవంతి పేర్కొన్నారు. సదాశివనగర్ మండలం ఉత్తనూర్ గ్రామనికి చెందిన శ్రీనివాస్, భాగ్యలక్ష్మి దంపతులు. వ్యవసాయం చేస్తూ తమ కూతురు స్రవంతిని చదివించారు. కుమార్తె స్రవంతి కాకతీయ కళాశాల నిజామాబాద్‌లో చదివింది. భవిష్యత్‌లో బ్యాంక్ అధికారి కావాలని కోరుకుంటున్నానన్నారు.

డాక్టర్‌గా సేవలందిస్తా..


ఉమైమా టక్రీమ్, నిజామాబాద్

నగరంలో ఆటోనగర్‌కు చెందిన ఉమైమ టక్రీమ్ తండ్రి దుబాయ్‌లో ఉంటాడు. తల్లి షహానా షంజుమా గృహిణి. వీరి కూతురైన ఉమైమ టక్రీమ్ ఇంటర్ ఫస్టియర్‌లో 437 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో నిలిచానన్నారు. పదోతరగతి భైంసాలో చదివి 9.8 జీపీఏ సాధించారు. అనంతరం కాకతీయ కళాశాలలో ఇంటర్ చదివి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారు. భవిష్యత్‌లో ఉత్తమ డాక్టర్‌గా సేవలందిస్తానన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా


ముత్యాల రిషిత, గంగస్థాన్-2

నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ముత్యాల రిషిత ఇంటర్ చదివింది. సెకండియర్ ఎంపీసీలో 991 మార్కులు సాధించింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని లక్ష్యంతో చదివింది.

జిల్లాకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన కాకతీయ విద్యార్థులు
- ఎంపీసీలో 989 మార్కులతో 6వ ర్యాంకు


అఫ్జల్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కాకతీయ కళాశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు స్రవంతి, మరో విద్యార్థి ఉమాయ అఫ్జల్ ఎంపీసీ సెకండియర్‌లో 989/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి 6వ ర్యాంకులు సాధించారు. అలాగే వైష్ణవి, భవాని, చింత సంపత్ ఎంపీసీలో 988 మార్కులతో ఏడో ర్యాంకులు సాధించారు. మైత్రి, నక్షత్ర 987 మార్కులు సాధించి, 8వ ర్యాంకులు పొందారు.

బైపీసీ విభాగంలో..

రసూదఫిర్డోస్ బైపీసీ 986/1000 మార్కులు సాధించి స్టేటు 9వ ర్యాంకు సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ ఫలితాల్లో టక్రీమ్ 437/440 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. రజిక ఎంపీసీ విభాగంలో 464/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించారు. సబసఫిక్ సీఈసీ విభాగంలో 485/500 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ రజనీకాంత్, చైర్‌పర్సన్ విజయలక్ష్మీ సన్మానించారు.

ఎస్ఆర్ కళాశాలల ప్రభంజనం..


రాష్ట్ర స్థాయి ర్యాంకర్లతో విజయ చిహ్నం చూపుతున్న కాకతీయ కళాశాల సిబ్బంది


నల్లా నేహా


స్పందన, 465/470 (ఎంపీసీ, వెక్టర్ కళాశాల)

నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చాయి. ఇంటర్ సెకెండియర్ ఎంపీసీ విభాగంలో ముత్యాల రిషిత్ 991/1000, చెన్నబోయిన శార్వానీ 991/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో సూర్యవంశీ శిరిష 990/1000 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో నల్ల నేహ 467/470, అక్షయ 467/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో అర్చన 436/440, జ్ఞానేశ్ 436/440 మార్కులు సాధించారు. దీంతో విద్యార్థులను కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు.

ఎస్ఎస్ఆర్‌కు ఉత్తమ మార్కులు..

నగరంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన అమరపాలి ఇంటర్ బైపీసీ సెకండియర్‌లో 970/1000 మార్కులు సాధించారు. గౌతమి 947 మార్కులు సాధించారు. అలాగే సీహెచ్ సృజన బైపీసీలో 937మార్కులు, అక్షయ్ ఎంపీసీలో 910/1000 మార్కులు సాధించారు. ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం మొహమ్మద్ 431/470 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సంస్థ చైర్మన్ మారయ్యగౌడ్ అభినందించారు.

ఉషోదయ కళాశాల ప్రతిభ..

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్ ఫలితాల్లో బోధన్‌లోని ఉషోదయ జూనియర్ కళాశాల విద్యార్థిని హిమవర్షిని బైపీసీ సెకండియర్‌లో 992 మార్కులు సాధించింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్ అభినందించారు.


రాష్ట్ర స్థాయి ర్యాంకర్లను సన్మానిస్తున్న ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి


హిమవర్షిని

కొమన్‌పల్లి విద్యార్థికి


బోగ వేదాన్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కొమన్‌పల్లికి చెందిన బోగ వేదాన్ ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 467/470 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని రావిర్యాల నారాయణ బ్రాంచ్‌లో అతడు చదువుతున్నాడు. ఉత్తమ మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు శ్రీనివాస్, ఉమారాణి హర్షం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాలతో సామాజిక భద్రత

- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్
- రెంజల్‌లో సీసీకెమెరాల ప్రారంభం



రెంజల్ మండలకేంద్రంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్

రెంజల్(బోధన్): సీసీ కెమెరాల ఏర్పాటుతో సామాజిక భద్రత పెరుగుతుందని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రెంజల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ద్వార ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను మంగళవారం ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. సీసీ కెమెరాలు వచ్చిన తర్వాత నేరాలు చాలావరకు తగ్గుతున్నాయన్నారు. సీసీ కెమెరాలు ఉన్నాయంటే వాటిని చూసి భయాందోళన దొంగల్లో ఏర్పడుతుందన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసు వ్యవస్థలో వస్తున్న మార్పులు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగమన్నారు. సీఎం కేసీఆర్ రూ.వెయ్యి కోట్లతో హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వార నేరాలను త్వరితగతిన గుర్తించి కేసులను చేధిస్తున్నట్లు వివరించారు. సర్పంచ్ మర్ల రమేశ్ కుమార్, బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ శ్రీనివాస్‌రాజ్, మాజీ ఎంపీటీసీ లోలపు కిషోర్, ఎస్సై సాయన్నలతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రుద్రూర్ : మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ పథకం అమలు తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి పథకంలో భాగంగా అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ జిల్లా లోని రాకాసీపేట్, సీతారాంనగర్ కాలనీ, ఆర్మూర్ అర్బన్ హెల్త్ సెంటర్లలో, రుద్రూర్, మెండోరా పీహెచ్‌సీ ల్లో ఆరోగ్య మహిళ పథకం అమలులో ఉందన్నారు. ఈ పథకంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తారన్నారు. పథకం ప్రారంభమైన తొమ్మిది వారాల్లో జిల్లాలోని ఐదు కేంద్రాల్లో 4,246 ఓపీ నమోదు కాగా 2,541 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ తదితర పరీక్షలను 2,773 మందికి, 879 మందికి గర్భసంచి పరీక్షలు నిర్వహించి, 8 మందిని జిల్లా ఆ స్పత్రికి రిఫర్ చేశామన్నారు. ఇవే కాకుండా పోషకాహారలోపం, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర పరీక్ష లు నిర్వహించి అవసరమైన చికిత్స, మందులు అందచేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు మండల వైద్యాధికారిణి అయేషా సిద్దిఖీ, హెల్త్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారిని మండలంలోని ఆశవర్కర్లు కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమ పనికి తగ్గ వేతనం ఇప్పించాలని కోరారు.


రుద్రూర్ పీహెచ్‌సీలో మహిళలతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుదర్శనం

డిమాండ్లు పరిష్కరించాలి

సుభాష్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి డిమాండ్‌చేశారు. నగరంలోని ధర్నా చౌక్‌లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు మంగళవారం భూపతిరెడ్డి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సాక్షాత్తూ అసెంబ్లీలో ప్రకటించిన మేరకు వెంటనే జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.

బీజేపీ సంపూర్ణ మద్దతు

నగరంలోని ధర్నా చౌక్‌లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దినేష్ కులాచారి, ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న మద్దతు తెలిపారు. వారిని రెగ్యులర్ చేసే వరకూ బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ఖలీల్ వాడి: నగరంలోని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌కు చెందిన పిట్టల శ్రీనివాస్(17) అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యం అయినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలు రావడంతో శ్రీనివాస్ ఫెయిల్ అయ్యాడు. దీంతో అతడు హైదరాబాద్ వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. ఆ తర్వాత అతడి ఆచూకీ లభించకపోవడంతో బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాలివాన బీభత్సం




నడిమితండాలో కూలిన ఇంటి గోడ.. యానంపల్లిలో కూలిన గోపురం.. సర్పల్లితండాలో దెబ్బతిన్న ఇల్లు

ఇందల్వాయి/సిరికొండ/ధర్పల్లి/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయ శిఖరంపై పిడుగు పడి పాక్షికంగా ధ్వంసమైంది. అలాగే సిరికొండ మండలంలోని సర్పల్లితండా జీపీ పరిధిలోని వడ్డెర కాలనీలో పలువురి ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. అలాగే పలువురి పశువుల పాకలు కూలిపోయాయి. ధర్పల్లి మండలంలోని నడమితండాలో ఓ ఇంటి గోడ కూలిపోయింది. ఎలాంటి ప్రాణం ఇస్తాం వాటిల్ల లేదు. జక్రాన్‌పల్లి మండలంలోని కేశ్‌పల్లిలో ఐదు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పెద్దపెద్ద వృక్షాలు నేలకొరిగాయి. కేశ్‌పల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చింత చెట్టు పడడంతో ఏబీ స్విచ్‌తో కూడిన విద్యుత్ స్తంభం కిందపడిపోయింది. కల్లాలు, రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయి.


భీమ్‌గల్ మండలం పల్లికొండలో పిడుగు పడి మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు

15నుంచి సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్

- మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీల నిర్వహణ
- విజేతలకు నగదు బహుమతులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఈనెల 15 నుంచి సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. 15సంవత్సరాల నుంచి 36సంవత్సరాల లోపు ఉన్న వారు పోటీల్లో పాల్గొనలన్నారు.

మండల స్థాయి పోటీలను ఈ నెల 15నుంచి 17వరకు నిర్వహించాలన్నారు. మండల స్థాయి విజేతల జట్లకు ఈనెల 22నుంచి 24వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన జట్టుకు ఈనెల 28నుంచి 31వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మండలస్థాయిలో..

అథ్లెటిక్స్(లాంగ్‌జంప్, షాట్‌పుట్), కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. ఎంపీపీ చైర్మన్‌గా, జెడ్పీటీసీ సభ్యులుగా, ఎంపీడీఓ కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎస్సై, ఎంఈవో, పీడీ, పీఈటీ, మున్సిపల్ కమిషనర్‌లుగా సభ్యులుగా ఉంటారు.

జిల్లాస్థాయిలో..

జిల్లాస్థాయిలో అదనంగా నిర్వహించే క్రీడలకు సంబంధించి నేరుగా పోటీలకు రావాలన్నారు. అథ్లెటిక్స్ (లాంగ్‌జంప్, షాట్‌పుట్), బాడ్మింటన్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, కుస్తీ, బాక్సింగ్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, సీపీ వైస్‌చైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్ కో వైస్ చైర్మన్‌గా, జిల్లా క్రీడల అధికారి కన్వీనర్‌గా, డీఈఓ, జిల్లా పరిశ్రమల అధికారి ప్రెసిడెంట్, జిల్లా ఒలింపిక్ సంఘం, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు.

రాష్ట్రస్థాయిలో..

రాష్ట్రస్థాయిలో అదనంగా నిర్వహించే క్రీడలకు సంబంధించి నేరుగా పోటీలకు రావాలన్నారు. ఇందులో ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్ (మహిళలు - పురుషులకు) హాకీ, వెయిట్ లిఫ్టింగ్ (పురుషుల)కు మాత్రమే ఉంటుందన్నారు.

బహుమతులు ఇలా..

వ్యక్తిగత క్రీడల్లో విజేతలకు రూ. 20వేలు, ద్వితీయ స్థానంలో రూ. 15వేలు, తృతీయస్థానంలో రూ. 10వేల నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. విజేత జట్టుకు రూ. 1లక్ష, ద్వితీయ రూ. 75వేలు, తృతీయ రూ. 50వేల నగదుతో పాటు బహుమతులు అందజేస్తారు.

చెరువులో పడి ఒకరి మృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మహ్మద్ రసూల్(47) సోమవారం ఉదయం జంగం చెరువు కట్ట కింద ఉన్న తన పొలంలో వరికోత పనికి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చెరువు కట్ట వద్ద వెతకగా నీటిలో పడి మృతిచెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. చెరువు వద్ద కాళ్లు, చేతులు కడిగే సమయంలో జారీ నీటిలో పడి పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య హైమది బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సైతెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని నర్సిరోడ్డులో ఆదివారం ఎమ్మెల్యే అనుచరుల వాహనం ఢీకొని తీవ్రగాయాల పాలైన అజ్జ దీపక్ తేజ(12) సోమవారం రాత్రి మృతి చెందాడు. మొదట బాలుడికి నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా.. మెరుగైన చికిత్స నిమిత్తం సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.



దీపక్‌తేజ మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

మృతుడి బంధువుల ఆందోళన..

మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. బాలుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సిలిండర్ లీకేజీతో ఇల్లు దగ్ధం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలం కేంద్రంలో మంగళవారం గ్యాస్ సిలిండర్ లీకై ఇల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా.. పూసవర్ల దేవ్, గురువయ్య మండలకేంద్రంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సోమవారం రాత్రి నీళ్ల వేడి చేయడానికి గ్యాస్ సిలిండర్‌ను స్టార్ట్ చేయగా ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. ఇంటి నుంచి బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కన ఉన్నవారంతా వచ్చి కాలిపోతున్న ఇళ్లపై నీళ్లు చల్లారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. సర్పంచ్ చాయచందు, ఆర్ఐ రాజేశ్వర్‌లు ఘటన స్థలానికి వచ్చి పంచనామా చేశారు. కూలీపని చేసుకునే బాధితులకు డబుల్ బెడ్‌రూంతో పాటు నష్టపరిహారం అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.


కాలిపోయిన ఇంటి వద్ద బాధితులు

వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే హత్యాయత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కిరణ్‌కుమార్



ఖలీల్‌వాడి: తన భార్యతో వివాహేతర సంబంధంపై ప్రశ్నించినందుకు భర్తపై భార్య ప్రియుడు హత్యకు యత్నించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నగరంలోని ఏసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన సయ్యద్ షహీన్, సయ్యద్ షకీల్ భార్యాభర్తలు. వీరికి కుమారుడు సోయబ్ ఉన్నాడు. షహీన్‌తో సయ్యద్ షఫివుల్లా హుస్సేన్‌కు వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భర్తకు తెలియడంతో, ఈనెల 8న ప్రియుడు హుస్సేన్ బయట మాట్లాడుకుందామని షకీల్‌ను, అతడి కొడుకు సోయబ్‌ను ఎల్లమ్మగుట్ట సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం హుస్సేన్ తన అక్రమ సంబందానికి అడ్డుగా ఉన్నాడని షకీల్‌ను పెద్ద బండరాయితో తలపై కొట్టి గాయపరచి, బీర్ సీసా పగులగొట్టి హత్యకు యత్నించాడు. దీంతో సోయబ్ అడ్డుపడగా, అతడిని సైతం చంపుతానని బెదిరించగా బయపడి పారిపోయాడు. వెంటనే హుస్సేన్ కూడా పారిపోయాడు. స్థానికులు గాయపడిన షకీల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సోయబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితుడుని పట్టుకొని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది వెంకటనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య


మోర ప్రజ్వల్ (ఫైల్)

ఆర్మూర్ టౌన్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన విద్యార్థి మోర ప్రజ్వల్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని శాస్త్రి నగర్‌లో నివసించే ఆర్ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ కుమారుడైన ప్రజ్వల్ హైదరాబాద్‌లోని మాదాపూర్ నారాయణ కాలేజీలో బైపీసీ చదివాడు. మంగళవారం పరీక్ష ఫలితాలు రాగా మూడు సబ్జెక్టులలో ఫెయిలయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఒంటరిగా ఉన్న ప్రజ్వల్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో క్లీనిక్‌లోనే పనిచేస్తున్న నర్సును చూసి రమ్మని ఇంటికి పంపించాడు. ఆమె తిరిగొచ్చి లేడని చెప్పింది. తర్వాత లక్ష్మణ్ భార్యతో కలిసి వెళ్లి పై అంతస్తులోకి వెళ్లి చూడగా ప్రజ్వల్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరి విశాఖ పట్టణంలో ఎంబీబీఎస్ పూర్తిచేసి గీతం యూనివర్సిటీలో పీజీ చేస్తోంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

అనారోగ్య కారణంతో ఒకరు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో ఓ వ్యక్తి అనారోగ్యం కారణంగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా... మండల కేంద్రానికి చెందిన చిట్టిపు వీరయ్య(58) మూడేళ్లుగా ఆస్తమాతో బాధ పడుతున్నాడు. ఆస్పత్రిల్లో చూయించిన నయం కాలేదు. గత ఆరు నెలల నుంచి దగ్గు, దమ్ము ఎక్కువయింది. దీంతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి వచ్చి, వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: మండల కేంద్రంలోని ఊరచెరువులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 50-55ఏళ్ల మధ్య ఉంటుందని ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఒంటిపై చొక్కలేదన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.